
# బాబాయి నన్ను క్షమించు!

* రచన: శ్రీ పేరిచర్ల రామకృష్ణరాజు *



(రచయిత)

ఈ రోజైనా నాకు రావల్సిన పదివేల రూపాయల్ని ఆయన వద్దనుంచి వసూలు చేయ్యాలని ఖచ్చితంగా నిర్ణయించుకున్నాను. నాలుగు సంవత్సరాల క్రితం అప్పుగా ఇచ్చాను. ప్రతి సంవత్సరం వడ్డీ మాత్రం ఇస్తున్నారు.

నా బాకీ కోసం ఆయన వద్దకు చాలాసార్లు వెళ్ళాను.

కాని...ఆయనను చూడగానే అడగలేకపోయేవాడ్ని.

కారణం...ఆయన పెదవులపై నిరంతరం చిరునవ్వు నాట్యం చేయటమే.

ఆ నవ్వే నన్ను మూగవాన్ని చేసేది!

ఇప్పుడున్న దీన పరిస్థితిలో కూడా నవ్వుతూ ఉండటం నాకు ఆశ్చర్యం వేస్తుంది. నేనే కాదు ఎవరైనా ఆశ్చర్యపోక తప్పదు.

ఆయనున్న స్థితిలో మరో వ్యక్తి ఉండివుంటే ఆత్మహత్య చేసుకోవటమో, బి.పి. పెరిగి మంచంపట్టడం జరిగి వుండేది.

కాని...ఆయన ఇప్పటికీ నవ్వుతూ...నవ్విస్తూ...చలోక్తులు విసురుతూ ఉంటాడు.

కాని...ఆ నవ్వు వెనుక విషాదాన్ని ఎందరు గుర్తించగలరు.

సరిగ్గా పాతిక సంవత్సరాల క్రితం ఆయన మకుటంలేని మహారాజు.

ఇప్పుడు మాత్రం చాలా దయనీయ స్థితిలో బ్రతకాల్సి వస్తూంది. మరి ఆస్తి తరిగి పోవడానికి కారణం...

ఆయనకు వ్యసనాలు లేవు! కూతుళ్ళకు ధారపోయలేదు!!

లోకులు ఎన్నో అనుకున్నా.

ఆయనపై ప్రకృతి దారుణంగా దెబ్బతీసింది అన్నదే నిజం.

ఆయన ఎవరో కాదు మా స్వంత బాబాయి.

ఆయన పేరే రాజగోపాలరాజు.

ఆయన వద్దకు బయలుదేరాను.

చిరునవ్వుతో నాకు ఆయనే ఎదురు వచ్చారు.

డబ్బు విషయం ఎలా అడగగలను.

అడగమని మనస్సు తొందర చేస్తుంది.

"ఏంట్రోయ్! నీలోనీవు మథన పడుతున్నావు" ఒకేసారి కంచులా మ్రోగింది ఆయన కంఠం.

"ఏం లేదు బాబాయ్‌గారు" ఆ సమయంలో ఏం చెప్పాలో తెలీలేదు నాకు.

"నా దగ్గిర సందేహం ఏంట్రా! ఏం చెప్పదల్చుకున్నావో నిస్సంకోచంగా చెప్పరాదూ" ఆయన పెదవులపై అదే చిరునవ్వు.

"నా...నాకు...రావల్సిన...బా...బాకీ ఇస్తారని"

"ఈ విషయం చెప్పటానికే నీ దగ్గరకు రావాలనుకుంటున్నాను. సాయంత్రం ప్రాంశరీ నోటు తీసుకుం-

రావల్సిన బాకీ తీర్చేస్తాను" చిరునవ్వు చెరగని వదనంతో నా భుజాని సౌమ్యంగా తడుతూ అన్నారు.

తొందరపడి బాకీ సంగతి అడిగినందుకు నా మనస్సు క్షణం సేపు క్షోభించింది!

X X X

మా బాబాయ్‌గారిది లంకంత ఇల్లు.

పెద్దహాలులో పెద్దలతో సహా అందరం కూర్చున్నాం.

సుమారు పది మందికి మా బాబాయ్‌గారు బాకీ చెల్లించాల్సి ఉంటుంది.

చెల్లించాల్సిన మొత్తం రెండులక్షల పైచిలుకు ఉంటుందని అంచనా.

నాతో పాటు మిగిలిన ఋణదాతలు అక్కడే కూర్చున్నారు.

మిగిలిన మూడు ఎకరాల పొలాన్ని అమ్మగా వచ్చిన డబ్బును కూడా అక్కడే పుంచారు.

మరో పెద్దమనిషి అందరి ప్రాంశరీ నోట్లను పరిశీలిస్తున్నారు. మా బాబాయ్ గెడ్డం క్రింద చేయి ఆన్చి కూర్చున్నారు. ఆయన వదనంలోకి చూసాను.

కను కొలకుల్లో ప్రత్యక్షమయిన అశ్రువులు.


ఆయన తన తండ్రి పోయినప్పుడు కూడా అంతలా కన్నీరు ఉబకలేదు. బహుశా యిదే తెలిసారి.

నిరంతరం నాట్యంచేసే చిరునవ్వు కూడా ఆ క్షణంలో మాయమయ్యింది.

"రూపాయికి ఏభై పైసలు చొప్పున బాకీ చెల్లించటానికి మాత్రమే డబ్బు సరిపోతుంది. మీరంతా పరిస్థితిని అర్థం చేసుకుని అంగీకరించండి" ప్రాంశరీ నోట్లను పరిశీలిస్తున్న పెద్దమనిషి మా వంక చూస్తూ అన్నారు.

రావల్సిన బాకీ మొత్తం చెల్లించాలిగాని సగం చెల్లిస్తే ఎలా చెప్పండి కొస్త గట్టిగా అన్నాను.

డబ్బు బంధుత్వాన్ని లెక్కచేయదు.




సరిగ్గా అప్పుడు చూసాను నా వంక మా బాబాయ్.

తప్పుచేసినట్లుగా నేను చూపులు మరల్చుకున్నాను.

"రాజుగార్ని బాకీ తీర్చమని మేము ఎప్పుడూ కోరలేదు. వారే రమ్మని కబురు పంపిస్తే వచ్చాం. ఈ స్థితిలో ఎంత ఇచ్చినా సమ్మతమే" వచ్చిన కొంతమంది ఋణదాతలు అన్నారు.

వారెవ్వరూ మా బాబాకి బంధువులు కారు. వారు చూపే జాలి, దయ తనెందుకు చూపలేకపోయాడు.

"మీకు పూర్తిగా అక్కరలేకపోవచ్చు కాని మా వాడు పూర్తి మొత్తం కావాలని కోరుతున్నాడు ఉన్న ఇల్లు అమ్మి అందరికీ ఇవ్వవలసిన మొత్తాన్ని ఇచ్చేద్దాం" పెద్దమనిషితో అన్నారు మా బాబాయ్!

బాబాయ్ వంక చూసాను.

పై కుండుతో కళ్ళు ఒత్తుకుంటున్నారు.

విషంతో నిండిన ఈటె గుండెల్లో దిగినట్లనిపించింది నాకు.

"వద్దు...వద్దు...ఉన్న ఈ ఇంటిని అమ్మకూడదు... నాకు రావల్సిన బాకీని రద్దు చేసుకుంటున్నాను"

అతనివంక చూసాను. అతడు వీరన్న. అతనికున్న ఆస్తి అంతంత మాత్రమే మళ్ళీ అతడే అన్నాడు.

"ఇన్నాళ్ళూ మీవద్ద వడ్డీ తింటూ కూర్చున్నాం. రాబందుల్లా పీక్కు తినాలన్న ఉద్దేశ్యం నాకు లేదు! మీరు అసలు ఇవ్వకపోయినా పర్వాలేదు...బాకీ మొత్తం తీర్చినట్లుగా ఒక్కరూపాయి ఇవ్వండి చాలు...అసలు తీసుకోకపోతే మీరు బాధపడతారు" వీరన్న మా బాబాయ్‌కి రెండు చేతులు నమస్కరిస్తూ అన్నాడు.

వీరన్నకున్న వ్యక్తిత్వం నాకు లేనందుకు నా గుండెల్లో అగ్నిపర్వతం బ్రద్దలైనట్లు అనిపించింది! అతని నిజాయితీ నన్ను పిచ్చివాణ్ని చేసింది. ఈ క్షణంలోనే ప్రాణం పోతే ఎంత బావుండును. అనిపించింది.

(5)

USE ALWAYS




Phone : 24010

9, K. N. P. Colony

Dharapuram Road TIRUPUR-638 608